క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



స్టేషన్‌ఘన్‌పూర్: రాఘవాపూర్‌కు చెందిన కొమురయ్య అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి బాధితుడి కుటుంబ సభ్యులకు సీఎం సహాయ నిధి ద్వారా రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి..

జఫర్‌గఢ్: గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని మండలంలోని తమ్మడపల్లి (ఐ) గ్రామస్తులు కోరారు. ఈ మేరకు హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. మాజీ సర్పంచ్ గాదెపాక అనిత సుధాకర్‌బాబుతో పాటు మహిళలు, గ్రామస్తులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న చిందు కళాకారుడి మృతి



చంద్రమౌళి(ఫైల్)

దేవరుప్పుల: మండల కేంద్రంలోని జనగామ–సూర్యాపేట రహదారిలో ప్రమాదవశాత్తు గాయాల పాలైన చిందు యక్షగాన కళాకారుడు చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారడు. ఎస్సై ఊర సృజన్‌కుమార్ కథనం మేరకు ... యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం సోమారానికి చెందిన ప్రముఖ చిందు యక్షగాన కళాకారుడు పిల్లిట్ల చంద్రమౌళి(50) సెప్టెంబర్ 20వ తేదీన దేవరుప్పులకు పనినిమిత్తం ద్విచక్రవాహనంపై రాగా, ప్రమాదవశాత్తు రోడ్డు డివైడర్‌కు ఢీకొని తీవ్రగాయాలపాలయ్యాడు. ఈ మేరకు క్షతగాత్రుడిని మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు స్థానిక పోలీసులు మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవపంచనామా చేశారు. కాగా, బాధిత కుటుంబానికి పద్మశ్రీ పురస్కార గ్రహీత గడ్డం సమ్మయ్య రూ.10 వేల సాయం అందించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఏఎన్‌ఎంకు తీవ్రగాయాలు

తరిగొప్పుల: రోడ్డు ప్రమాదంలో ఏఎన్‌ఎం తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని అంకుషాపూర్ హెల్త్ సబ్‌సెంటర్‌లో ఏఎన్‌ఎం అన్నపూర్ణ విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని బైక్ లిఫ్ట్ అడిగి మండలకేంద్రానికి వెళ్తుండగా గ్రామ శివారు దర్గా సమీపంలో రోడ్డుపై గుంతల ఉండడంతో బైక్ ఎత్తివేయడంతో పట్టుతప్పి రోడ్డుపై పడిపోయింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడగా రెండు కాళ్లు విరిగాయి.వెంటనే సమాచారం అందుకున్న ఆశ వర్కర్లు తాటికొండ సుధ జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ ఆలేటి దేవేందర్, పంచాయతీ కార్యదర్శులు భాగ్యలక్ష్మి, అమనగంటి మహేందర్ ,ఏఎన్‌ఎం వసంత రాణి సదరు ఏఎన్‌ఎం పరామర్శించి చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు.

యువకుడి అదృశ్యం



సతీష్

తరిగొప్పుల: మండలంలోని బొత్తలపర్రె గ్రామానికి చెందిన భూక్య సతీష్(20) అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై అయ్యాల శ్వేత గురువారం తెలిపారు. భూక్య సతీస్ సెప్టెంబర్ 30వ తేదీ నుంచి కనిపించడం లేదని, కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకి లభించలేదని పేర్కొన్నారు. యువకుడి తండ్రి సక్రు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నీటిని విడుదల చేయాలి

జనగామ రూరల్: బొమ్మకూర్ రిజర్వాయర్ నుంచి మండలంలోని పసరమడ్ల గ్రామానికి గోదావరి జలాలను విడుదల చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు ఇరిగేషన్ ఈఈకి వినతి పత్రం గురువారం అందజేశారు. శివరాత్రి కుమార్, ఎండీ సర్ధార్, సుదగాని భిక్షపతి, దూడల తిరుపతి, బండి రాజు, కోడారి రాములు, గంగరబోయిన మల్లేషం, మచ్చ సత్తయ్య, తదితరులు ఉన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

జనగామ రూరల్: మండలంలోని యశ్వాంతాపూర్ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ దామోదర్ రెడ్డి హెచ్చరించారు. గ్రామానికి చెందిన కొందరు యువకులు వారం కిందట ఇసుక అక్రమ తరలింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా పోలీసులు స్పందించారు. ఈ మేరకు బుధవారం రాత్రి వాగులో కందకాలు తీసి ఇసుక అక్రమంగా రవాణా చేయకుండా చర్యలు తీసుకున్నారు.

చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ణయించండి

- సర్వే చేపట్టి హద్దుల ఏర్పాటులో నిర్లక్ష్యం
- నీటిపారుదల శాఖ అధికారులను ప్రశ్నించిన ప్లాట్ల యజమానులు



నెల్లుట్ల పెద్ద చెరువు



నీటిపారుదల శాఖ డీఈ రవీందర్‌ను ప్రశ్నిస్తున్న ప్లాట్ల యజమానులు

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ణయించండంటూ నాలుగు నెలలుగా చెరువును ఆనుకొని ఉన్న సుమారు 300 మంది ప్లాట్ల యజమానులు అధికారుల వెంటబడుతున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే కడియం శ్రీహరికి విన్నవించగా నీటిపారుదల శాఖ అధికారులకు ఫోన్ చేసి చెరువు ఎఫ్‌టీఎల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో గురువారం నీటిపారుదల శాఖ డీఈ రవీందర్ సిబ్బందితో ఎఫ్‌టీఎల్ సర్వే చేసేందుకు సిబ్బందిని తీసుకొచ్చారు. కంప చెట్లు, తుంగ, నేలంతా బురదమయంగా ఉండడం చూసి ప్రస్తుతం వీలు అయ్యే అవకాశం లేదని కొంత సమయం ఇవ్వాలని ప్లాట్లు కలిగినవారు కోరగా నాలుగు నెలల క్రితం సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయలేదు.. ఇంకా ఎప్పుడు చేస్తారంటూ డీఈని ప్రశ్నించారు. ఎఫ్‌టీఎల్ ఒక నెల్లుట్ల రోడ్డులోనే కాదని, చెరువు మొత్తం అనగా జనగామలోని ఉడుముల ఆస్పత్రి నుంచి చేయాల్సి ఉంటుందని, వారం రోజుల సమయం ఇవ్వాలని కోరగా ప్లాట్ల యజమానులు అసంతృప్తితోనే అంగీకరించారు. ఇది లా ఉండగా నెల్లుట్ల సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌కు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు సుమారు రూ.40 లక్షలతో సీసీ రోడ్డు వేశారని పత్రికల్లో వార్తలు వచ్చిన నేపథ్యంలో మే నెలలో రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. సర్వే నివేదికను అధికారులకు అందజేసి చేతులు దులుపుకున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం హద్దులు ఏర్పాటు చేయలేదు. దీంతో వారు అధికారులే ఏర్పాటు చేస్తారులే అంటూ పెద్దగా పట్టించుకోలేదు. దీంతో తమ అవసరాల రిత్యా ప్లాట్లు విక్రయించేందుకు వీలులేకుండా పోయిందని ఆందోళన చెందుతున్నారు. ఒక వైపు హైడ్రాతో హైదరాబాద్‌లో అంతా హల్‌చల్ జరుగుతున్న నేపథ్యంలో త్వరగా ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ణయించాలని కోరుతున్నారు.

గీత కార్మికులకు రక్షణ కిట్‌పై అవగాహన



రక్షణ కిట్ల వినియోగంపై శిక్షణ ఇస్తున్న ట్రెయినర్లు

రఘునాథపల్లి: తాటి చెట్టు ఎక్కే క్రమంలో ప్రమాదాల బారిన పడకుండా గీత కార్మికులకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచం సేఫ్టీ మోకులను పంపిణీ చేస్తుందని జిల్లా బీసీ వెల్ఫేర్ జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, జిల్లా కోఆర్డినేటర్ వెంకటమల్లయ్య గౌడ్ అన్నారు. మండలంలోని వెల్ది గ్రామ తాటి వనంలో అశ్వరావుపల్లి, మండలగూడెం, జాఫర్‌గూడెం, ఖిలాషాపూర్‌కు చెందిన గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లపై గురువారం అవగాహన కల్పించారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ రాజేష్‌యాకుబ్‌పాషా, కల్లు గీత కార్మిక సంఘం నాయకులు బుర్ర లక్ష్మీనారాయణ, బాల్నె రాజయ్య, కుర్ర రాజు, పెద్దగోని యాదగిరి, బండమీది వెంకన్న, యాకయ్య, పాపయ్య, బిక్షపతి, నర్సయ్య, ట్రెయినర్లు గూడ రవీందర్, వడ్లకొండ వెంకటేష్, సంతోష్‌కుమార్, అంజయ్య, కార్తీక్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్సై ఎస్‌కే హమీద్

బచ్చన్నపేట: మండల ఎస్సైగా ఎస్‌కే హమీద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన కంకల సతీష్‌కుమార్ వరంగల్ ఐటీకి బదిలీ కాగా వీఆర్ నుంచి హమీద్ బచ్చన్నపేటకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు ఉన్న వారు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు రావాలని, మధ్య దళారులను ఆశ్రయించొద్దని సూచించారు. కాగా, ఎస్సై హమీద్‌ను పలు పార్టీల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఆయనను కలిసిన వారిలో నూకల బాల్‌రెడ్డి, చెంద్రారెడ్డి, శ్రీనివాస్, నరేష్, హరీశ్, ఉపేందర్‌రెడ్డి, బాలకిషన్, మహాత్మాచారి తదితరులు ఉన్నారు.

బాల్యమిత్రుడి కుటుంబానికి సాయం



సాయం అందజేస్తున్న బాల్యమిత్రులు

దేవరుప్పుల: మండలంలోని మున్పహాడ్‌లో అకాల మరణం పొందిన మామిండ్ల రాము కుటుంబానికి బాల్యమిత్రులు రూ.30 వేల సాయం అందించి బాసటగా నిలిచారు. తమ మిత్రుడి కుటుంబ అభ్యున్నతి కోసం పాటుపడుతామన్నారు. కార్యక్రమంలో బాల్యమిత్రులు చింత రవి, మారపెల్లి మురళి, మహమ్మద్ ఖాజా,నసీరోద్దీన్, పులిపంపుల సురేష్, వేల్పుల ఎల్లేష్, జక్కి నరేష్ పాల్గొన్నారు.

గొల్లపల్లిలో..

మండలంలోని గొల్లపల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బట్ట ఎల్లయ్య మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి ఆర్థిక సాయం అందించి ప్రగాఢ సంతాపం తెలిపారు. జాకీర్, తీగల వెంకన్న, నాయకులు తదితరులు ఉన్నారు.

ఈదురు గాలులతో వర్షం.. నేలవాలిన వరి



నేలవాలిన వరిని చూపుతున్న బాధిత రైతు సృజన్‌రాయ్

రఘునాథపల్లి: మండలంలోని గిద్దబండతండా, మేకలగట్టులో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కురిసిన వర్షంతో పలువురు రైతుల వరి పంట అతలాకుతలమైంది. గురువారం ఉదయం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లిన రైతులకు వరి పంట నేలవాలి ఉండటంతో ఆందోళన చెందారు. పంట చేతికొచ్చే సమయంలో నేల వాలడంతో తీరని నష్టం చేకూరిందని రైతులు వాపోయారు. గిద్దబండ తండాలో సృజన్‌రాయ్ అనే యువ రైతు సాగు చేసిన వరి పంట పూర్తిగా నేల కొరిగింది. నేల వాలిన వరి పంటను యంత్రాలు కూడా కోయలేవని, అధికారులు వరి పంటలను పరిశీలించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని పాంనూర్ గ్రామంలో తీవ్రంగా ఉన్న విద్యుత్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రజలు గ్రామంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఒగ్గు రాజు, పొన్న బీరయ్య, అన్వర్ తదితరులు మాట్లాడారు. గ్రామంలో గృహాలకు, వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోయారు. బుధవారం రాత్రంతా విద్యుద్ సరఫరా లేదని, ఎంగిలిపూల బతుకమ్మ పండుగ రోజున కరెంటు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. గతంలో శివునిపల్లి సబ్‌స్టేషన్ నుంచి పాంనూర్‌కు విద్యుత్ సరఫరా ఉండేదని, జఫర్‌గడ్ మండలం ఉప్పుగల్లులో నూతన సబ్‌స్టేషన్ ప్రారంభించాక ఆరు నెలల క్రితం నుంచి ఉప్పుగల్లు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ అందిస్తున్నారన్నారు. అప్పటి నుంచి పాంనూర్‌కు కరెంటు కష్టాలు మొదలయ్యాయని, ప్రతీ రోజూ చీటికి మాటికి విద్యుత్ కోతలతో పడరాని పాట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి అయిందంటే కరెంటు కోతలు ఎక్కువవుతున్నాయని, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు చాడ శివారెడ్డి, పొగాకు కుమారస్వామి, రాజు, మోడెం శంకర్, బత్తిని శ్రీనివాస్, తాళ్ళపెల్లి రాజు, దశరథం తదితరులు పాల్గొన్నారు. కాగా, గ్రామస్తులు రాస్తారోకో చేస్తున్న విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ ఏఈ శివకుమార్, లైన్‌ఇన్‌స్పెక్టర్ పెద్దిరెడ్డి అక్కడికి చేరుకున్నారు. దాంతో గ్రామస్తులు విద్యుత్ సమస్యపై వారిని ప్రశ్నించారు. ఇందుకు ఏఈ స్పందిస్తూ గ్రామంలో విద్యుత్ సమస్య ఉన్నది వాస్తవమేనని, రెండు రోజుల్లో సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న ఏడీఈ వంశీకృష్ణ గ్రామానికి చేరుకుని పరిస్థితులను తెలుసుకున్నారు. ఏడీఈ ఆదేశాల మేరకు ఏఈ శివకుమార్ పర్యవేక్షణలో గురువారం విద్యుత్ మరమ్మతు పనులను చేపట్టారు. గ్రామంలో విద్యుత్ ఏ, బీ స్విచ్‌లను అమర్చడంతో పాటు విద్యుత్ పరంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సత్వర చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మృత్యువుతో పోరాడి ఓడిన కట్టర్ రమేశ్

- నాలుగేళ్లుగా అచేతన స్థితిలోనే..
- న్యాయం కోసం పోరాడినా ఫలితం శూన్యం



రమేశ్(ఫైల్)

లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన జాగిళ్లపురం రమేశ్(30) ట్రాన్స్‌కోలో కట్టర్‌గా పనిచేస్తూ నాలుగేళ్ల క్రితం కొత్తపల్లిలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ చివరికి గురువారం మృత్యువాత పడ్డాడు. కొత్తపల్లిలో 2020 జూన్ 4న రమేశ్ విద్యుత్ ప్రమాదానికి గురయ్యాడు. దీంతో మెడ నరాలకు బలమైన గాయాల కారణంగా కాళ్లు, చేతులు, నడుము స్పర్శ కోల్పోయి మంచానికే పరిమితమయ్యాడు. కట్టర్‌గా పని చేస్తూ ప్రమాదా నికి గురైన రమేష్‌కు ఏడాది పాటు వేతనం ఇచ్చి అనంత రం మానేశారు. అచేతన స్థితిలోనే ఉన్న అతను కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట పలు మార్లు ఆందోళన చేయగా.. చేస్తాం.. చూస్తాం అంటూ చెప్పిన అధికారులు ఏమీ చేయలేదు. దీంతో లేబర్ కోర్టులో కేసు వేసి న్యాయం కోసం పోరాడుతున్నాడు. నాలుగేళ్లుగా మంచానికే పరిమితం కావడంతో శ్వాస సంబంధ వ్యాధి బారిన పడ్డాడు. దీంతో ఇటీవలే హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స చేయించినా ఫలితం దక్కలేదు. చివరకు గురువారం తుది శ్వాస విడిచాడు. జాగిళ్లపురం ఉప్పలయ్య, ఆండాలుకు కూతురుతో పాటు రమేష్ ఒక్కడే కొడుకు కావడంతో ఎప్పటికైనా బాగుపడతాడనే నమ్మకంతో నాలుగేళ్లుగా సేవ చేసిన తల్లిదండ్రులకు నిరాశే మిగిలింది. కట్టర్‌గా పని చేస్తూ గ్రామంలో ఎవరు పిలిచినా వెళ్లి పనులు చేసే రమేష్ మృత్యువుతో పోరాడి చనిపోవడంతో అందరూ అయ్యో పాపం అంటూ కంటతడి పెట్టారు.

అన్నదాతలకు బీఆర్‌ఎస్ బాసట



సమావేశంలో నాయకులు

దేవరుప్పుల: అధికారం పరమావధిగా కాకుండా అన్నదాతల సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ బాసటగా నిలుస్తోందని ఆ పార్టీ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం విలకేరుల సమావేశంలో వారు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏకకాలంలో ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణాత్మకంగా తిరకాసులతో మాట తప్పుతుందన్నారు. పాలకుర్తి నియోజకవర్గ రైతుల పక్షాన పంట రుణమాఫీ సత్వర అమలు చేయాలనే డిమాండ్‌తో శుక్రవారం తొర్రూరులో తలపెట్టిన మహాధర్నాకు అధిక సంఖ్యలో రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. బస్వ మల్లేశం, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చింత.రవి, మాజీఎంపీపీ సోమన్న, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



నర్మెట: వెల్దండలో పూజలో పాల్గొన్న యువజన సంఘం నాయకులు



దేవరుప్పల: పెద్దమడూరులో..



స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లిలో..



పాలకుర్తి టౌన్: బాలా త్రిపుర సుందరిగా..



రఘునాథపల్లి: శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో..



బచ్చన్నపేట: పోచన్నపేటలో..



జనగామ: విజయదుర్గా ఆలయంలో..



చిల్పూరు: చిన్నపెండ్యాలలో విగ్రహ దాత దామోదర్‌- వేదవతి తదితరులు



జనగామ: శ్రీవిలాస్ కాలనీలో..



పూజ చేస్తున్న అర్చకులు



జఫర్‌గఢ్‌లో..



జనగామ: పూజలో పాల్గొన్న భక్తులు

దేవరుప్పుల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పల్లెల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని పెద్దమడూరులో దుర్గామాత ఉత్సవ కమిటీ, కడవెండిలో సంస్కార్ యువజన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు ప్రారంభించారు, దుబ్బ రాజశేఖర్ గౌడ్ లక్ష్మీ ప్రసన్న, కమ్మంపాటి అనిల్, రవి, శ్రీకాంత్, రాజు, చిక్కుల వెంకటేష్, రాజు రెడ్డి, పురోహితులు పాల్గొన్నారు.

నర్మెటలో..

నర్మెట: మండల కేంద్రంతో పాటు వెల్దండ, అమ్మాపురం, మచ్చుపహాడ్, హన్మంతాపురంలలో యువజన సంఘాలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించి నవరాత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంతోపాటు శివునిపల్లి, తాటికొండ గ్రామంలో దుర్గామాత అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వేదపండితుడు వినయ్‌శర్మ, పూజారులు శేఖర్‌శర్మ, బ్రహ్మశ్రీ నర్సింగోజు బ్రహ్మచార్యులు, జీడికంటి వరుణాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బాలత్రిపుర సుందరిదేవిగా అమ్మవారు

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బాలాత్రిపుర సుందరి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. జిల్లా జడ్జి సుచరిత దంపతులు సోమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈఓ చల్వాది మోహన్ బాబు, ఎస్సై సాయిప్రసన్న కుమార్, ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పాలకుర్తి టౌన్: మహబూబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో గురువారం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో వేదిక ఒకసారిగా కూలడంతో కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జ్ హనుమండ్ల ఝాన్సీరెడ్డి కాలు విరగడంతో బలమైన గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం హైదాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. ప్రమాద వివరాలను పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు, అలాగే ఝానీరెడ్డిని తెలంగాణ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కమిషన్ సభ్యులు బండారు సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీరాం భద్రయ్య, మొగుళ్ల అశోక్‌కుమార్‌రెడ్డి, బొబ్బల రమణారెడ్డి తదితరులు పరామర్శించారు.

ఇటుకాలపల్లిలో..

బచ్చన్నపేట: మండలంలోని ఇటుకాలపల్లి గ్రామానికి చెందిన నర్సమ్మకు కాలు విరిగి నీలిమ ఆస్పత్రిలో చికిత్సపొందుతోంది. కాగా, గురువారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధితురాలిని పరామర్శించారు.

సంక్షిప్త సమాచారం


కమిటీ ఎన్నిక



సమ్మయ్య

చిల్పూరు: మండల కేంద్రంలో నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి రఘుపతి, వర్కింగ్ ప్రసిడెంట్ వెంకటేష్‌ల ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొత్తపల్లి సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా మామిడాల శ్రీనివాస్, కోశాధికారిగా ఎలకంటి సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా నాగవెల్లి రాజు, గౌరవ అధ్యక్షుడిగా ఉద్దెమారి మురళి, ఉపాధ్యక్షుడుగా రవీందర్, వర్కింగ్ ప్రసిడెంట్‌గా వీరస్వామి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ మండలంలో నాయిబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు.

సోమనర్సయ్య సేవలు మరువలేనివి



పాలకుర్తి టౌన్: తెలంగాణ రైతాంగ సాయిధ పోరాటంలో జీడీ సోమనర్సయ్య సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న అన్నారు. పాలకుర్తి మండల కేంద్రంలో సోమనర్సయ్య స్మారక స్తూపం వద్ద గురువారం జెండాను ఆయన ఎగురవేసి మాట్లాడారు. సోమసత్యం, మాసంపల్లి నాగయ్య, చిట్యాల ఐలమ్మ మనవరాలు చిట్యాల రాణి, సోమనర్సయ్య కుటుంబ సభ్యులు రవి, సోమేశ్వర్, హరీశ్, కట్ట నర్సింహులు, షేరు అశోక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి



బచ్చన్నపేట: ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతి ఒక్కరూ పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని తమ్మడపల్లిలో గ్రామసభ సందర్భంగా గురువారం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. వెంకటేష్, విజేందర్, ఎల్లయ్య, అశోక్, రవి, బాబు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న నర్సిరెడ్డి

బచ్చన్నపేట: ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ నర్సిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ సాంస్కృతిక కళాకారులతో గురువారం కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో ఫోన్‌లో మాట్లాడకూడదని, ఓటీపీలు, సీక్రెట్ కోడ్‌లను తెలుపొద్దన్నారు. కానిస్టేబుళ్ల యాదగిరి, రాకేష్, జమాల్, అనిల్, కళా బృందం సభ్యులు పాల్గొన్నారు.